క్లుప్తంగా

రేపు ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

చేవెళ్ల: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్ఎస్) వందేళ్ల ఉత్సవాల సందర్భంగా చేవెళ్లలో ఖండ ఆధ్వర్యంలో పథ సంచలన్ (రూట్‌మార్చ్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఖండ సంఘచాలక్ బి.కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం చేవెళ్లలోని రచ్చబండ వద్ద నుంచి ప్రధాన వీదుల గుండా సాగుతూ వివేకానంద కళాశాల వద్ద ముగిస్తుందని చెప్పారు. కళాశాల సమీపంలోనే సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

ఉచిత వైద్య శిబిరం

షాబాద్: గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐజీ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఆనంద్ కులకర్ణి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో ఏఐజీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 150 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, గ్రామస్తులు వెంకటేష్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌కు తరలిన సీపీఎం శ్రేణులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని బీసీ కులాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం తెలపాలన్నారు. అనంతరం నగరంలో రాజ్‌భవన్ ముట్టడికి వెళ్లిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిలో నాయకులు ఈశ్వర్‌నాయక్, గోపాల్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

షాబాద్: ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, లైబ్రరీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించే వారు ప్రతిభను పెంచేటట్లుగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాఘవేందర్, ఏఎంఓ రవికుమార్ తదితరులున్నారు.

విద్యార్థులు సేవా దృక్పథంతో ఉండాలి



ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫ్రోజ హాన్ ఆధ్వర్యంలో గత 7 రోజులుగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశనుండే సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా వలంటీర్లు గ్రామంలో పలు అభివృద్ధి, చైతన్య కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి జగదీశ్వర్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణఅంజయ్యయగౌడ్, మాజీ ఉప సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, హెచ్ఎం అరుంధతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకురాళ్లు మంతాజ్, పరమేశ్వరి, రాజేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు

- పండగల వేళ ఫుల్ డిమాండ్
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- చేవెళ్ల డివిజన్ ఉద్యానశాఖ అధికారి కీర్తి



షాబాద్: నీటి వసతి కలిగి ఉన్న చోట బంతి పూల సాగు అనుకూలమైంది. అతి తక్కువ పెట్టుబడితో చిన్న మెలకువలను పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. డ్రిప్ పద్ధతిని అవలంబిస్తే నీటిని కూడా పొదుపు చేయడానికి అవకాశాలున్నాయి. పండుగలు, ఇంటి గుమ్మాల అలంకరణకు, ఆలయాల్లో నిర్వహించే పూజలకు బంతి పూలకు మంచి డిమాండ్ ఉంది. తక్కువ నీటి వనరులతో పూలను సాగు చేస్తూ, సస్యరక్షణ చేపడితే ఆర్థికాదాయాన్ని సాధించవచ్చని చేవెళ్ల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి కీర్తి తెలిపారు. బంతి పూల సాగుపై ఆమె సలహాలు, సూచనలు తెలియజేశారు.

విత్తుకునే సమయం

నీటి వసతి కలిగిన అన్ని కాలాలు అనుకూలం. సారవంతమైన గరప నేలలు, నీరు త్వరగా ఇంకిపోయే నేలల్లో బంతి సాగు అనుకూలంగా ఉంటుంది. బంతి మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ పూల ఉత్పత్తి మాత్రం తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఆఫ్రికన్ బంతి, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ రకాలున్నాయి. ఎకరానికి వెయ్యి గ్రాముల విత్తనాలు అవసరం అవుతాయి. మడులను తయారు చేసి విత్తనాలను చల్లుకోవాలి.

ఎరువుల వాడకం

మడులను తయారు చేసే సమయంలో ఎకరానికి 20 టన్నుల బాగా చివికిన పశువుల ఎరువు వేసి కలియ దన్నుకోవాలి. దీంతో పాటు 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. నాటిన 37 రోజులకు 20 నుంచి 40 కిలోల నత్రజనిని వేసి నీరు పెట్టుకోవాలి. విత్తిన విత్తనాలు వారం రోజుల్లో మొలకెత్తుతాయి.



మాచన్‌పల్లిలో బంతి పూల సాగు

నాటుకునే విధానం

నెల వయసు కలిగిన బంతి మొక్కలు నాటుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. నాటుకు వచ్చిన నారును సాయంత్రం వేళల్లో నాటుకోవాలి. నాటిన 60 రోజుల తర్వాత పూత దశ వచ్చేవరకు నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. నీటి ఎద్దడితో బంతి సాగు దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది.

పూల కోత:

బంతి పూలు బాగా విచ్చుకున్న తర్వాతనే కోసుకోవాలి. కోతకు ముందు నీటి తడి ఇచ్చినట్లయితే పూలు ఎక్కువ సమయం తాజాగా వాడిపోకుండా నిలువ ఉండేందుకు వీలు ఉంటుంది. పూలను ఉదయం లేదా సాయంత్రం మాత్రమే కోయాలి. సాధారణంగా ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నుల దిగుబడి వస్తుంది.

సస్యరక్షణ చర్యలు

పేను: పూల మొగ్గలను ఆశించి నష్ట పరుస్తాయి. వీటి నివారణకు లీటర్ నీటికి మోనోక్రొటోఫాస్ 1.5మి.లీ. కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగులు: తామర పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీల్చి నష్టపరుస్తాయి. ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడతాయి. మొగ్గలు గోధుమ రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొగ్గతొలిచే పురుగులు: లార్వాలు పూల మొగ్గలను తొలిచివేస్తాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ

నారుకుళ్లు తెగులు: నీటి తడి ఎక్కువగా ఉండి వేడిగా ఉన్న చోట ఈ తెగులు వ్యాపిస్తుంది. లేత మొక్కలు చనిపోతాయి. మడులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండే విధంగా చూడాలి. నేలను లీటర్ నీటికి 2 గ్రా. కాప్టాన్ మందుతో తడపాలి.

ఆకు మచ్చ తెగులు: మొక్కల్లో బూడిద రంగు, లేదా నల్లని మచ్చలు ఏర్పడతాయి. లీటర్ నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి.

రక్తదానానికి ముందుకు రండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, చిత్రంలో సీఐ వీరబాబు

శంకర్‌పల్లి: అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మోకిల సీఐ వీరబాబు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసేందుకు విద్యార్థులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చారు. సీఐ వీరబాబు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది పోలీసులు అమరులు అయ్యారని, వారిని స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ లా స్కూల్ డైరెక్టర్ ప్రొ.డా.రవిశేఖర రాజు, డీన్ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై 108 సిబ్బంది అవగాహన



కొత్తూరు: సీపీఆర్‌పై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు: అనుకోకుండా గుండెనొప్పి బారిన పడే వారికి ఏ విధంగా సీపీఆర్ చేసి రక్షించాలో కొత్తూరు పట్టణంలో 108 అంబులెన్స్ సిబ్బంది అవగాహన కల్పించారు. శుక్రవారం దర్గారోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఆర్‌తో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. బాధితులకు సకాలంలో సీపీఆర్ అందితే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ఆపదలో ఉన్న వారికి సాయం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఎంటీ రామచంద్రయ్య, పైలట్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చౌరస్తాలో..

నందిగామ: సడన్‌గా గుండె కొట్టుకోవడం ఆగిపోయిన అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని 108 ఈఎంటీ గంగాధర్, పవన్‌లు అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని గాంధీ చౌరస్తాలో శుక్రవారం గ్రామస్తులకు సీపీఆర్ గురించి అవగాహన కల్పించారు.

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. గుండె ఆగిపోయినప్పుడు వెంటనే గుర్తించి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సీపీఆర్ చేయాలని అన్నారు. పేషెంట్ ఛాతిపై మధ్య భాగంలో గట్టిగా నొక్కాలని సూచించారు. అనంతరం వెంటనే రోగిని ఆసుపత్రికి తరలించి తగిన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ అమృత జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాల పంపిణీ



మొయినాబాద్: అజీజ్‌నగర్‌లో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న సిబ్బంది



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో గేదెలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో శుక్రవారం పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి అహ్మద్ మాట్లాడుతూ పశువులకు ముందు జాగ్రత్త చర్యగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేయడం వల్ల గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. గ్రామంలోని 197 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు ఉన్నారు.

టీకాలు తప్పనిసరి

మొయినాబాద్‌రూరల్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో పశువులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్ రవి, గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయిచుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మద్దూరు, రేగడిదోస్వాడ, కుమ్మరిగూడ, కక్కులూర్, అంతిరెడ్డిగూడ, గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

రైతు చట్టాలు అమలు చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నానా అక్రేజీ



సమావేశంలో మాట్లాడుతున్న నానా అక్రేజీ

కొందుర్గు: రైతు చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నానా అక్రేజీ అన్నారు. బీకేఎస్ రాష్ట్ర కోశాధికారి మాణిక్యరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మండలంలోని రేగడి చిల్కమర్రి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నానా అక్రేజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని 777 జిల్లాల్లో ఇప్పటివరకు 555 జిల్లాల్లో భారతీయ కిసాన్‌సంఘ్ సేవలందిస్తుందన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ రాజకీయాలకతీతంగా రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. రైతులందరూ సంఘటితమై పోరాడితేనే సమస్యలు తీరుతాయన్నారు.

గ్రామ కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా రేగడిచిల్కమర్రిలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరేశం, కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌జీ, సురేష్ బాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ షాబాద్ మండలాధ్యక్షుడు యాదవ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కొందుర్గు: ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషకరమైన విషయమని కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు కావలి రాజు అన్నారు. స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం గోపులారం మాజీ సర్పంచి పొడువు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శంకర్‌పల్లి మండలం టంగటూర్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడి పని చేసిన వారికి పదవులు వస్తాయని, ఎవరూ అధైర్య పడోద్దని సూచించారు.



ఎమ్మెల్యే యాదయ్యతో టంగటూర్ గ్రామ నాయకులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్లకు చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, కసిరే వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విజయలక్ష్మి భర్త నర్సింలు, ప్రశాంత, హైమద్ తదితర తన అనుచరులతో సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీసీల రిజర్వేషన్లలో కూడా కాంగ్రెస్ పార్టీ మాట తప్పిందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో నిలబడే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌రెడ్డి, దర్శన్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నం సిగ్గుచేటు



శంకర్‌పల్లి: ర్యాలీగా వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

శంకర్‌పల్లి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నించిన అడ్వకేట్ రాకేశ్ కిషోర్‌ని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ శుక్రవారం శంకర్‌పల్లి పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సురేందర్‌కి వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదగిరి మాట్లాడుతూ.. దేశ అత్యున్నత న్యాయమూర్తిపై దాడికి యత్నించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం, పోలీసులు వెంటనే స్పందించి సుమోటో కేసుగా స్వీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు లింగం సాయి, సంపత్, గోపాల్, మహేశ్, అనిల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

కొందుర్గు: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఆనంద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆజాం అలీ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భీమసేన, రమేష్, రాజ్‌కుమార్, సతీష్, నరేష్, రాజు, శేఖర్, లింగం, రాములు పాల్గొన్నారు.



కొందుర్గు: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రులకు ఘన స్వాగతం

షాద్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వెళ్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి శుక్రవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. షాద్‌నగర్ శివారులోని బైపాస్ రోడ్డులో స్వాగతం పలికి, శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, రఘు నాయక్, కొంకళ్ల చెన్నయ్య, దంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి



షాబాద్: దీక్షలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

మద్దతు తెలిపిన వివిధ పార్టీల నాయకులు

షాబాద్: తెలంగాణ నుంచి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, బీసీ రిజర్వేషన్ల సమితి సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రిలే దీక్షలో ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధనకు 18న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేష్, నాయకులు రాజేందర్‌గౌడ్, రవీందర్, నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, స్వామి, రాము, గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సహకరించండి

నందిగామ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో నిర్వహించే బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బంటారం సుదర్శన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రాజ్యాంగబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

సంపూర్ణ మద్దతు

చేవెళ్ల: బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కానీ ప్రస్తుతం వ్యవహారం కోర్టు పరిధిలో ఉందన్నారు. త్వరలోనే అడ్డంకులు తొలగిపోయి బీసీలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ఐక్యత చాటాలి

బీసీ సంఘాలు చేపట్టిన బంద్‌ను చేవెళ్లలో విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు జీవో తీసుకువస్తే దాన్ని అడ్డుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుప్రకటిస్తోందని తెలిపారు. సకలజనులంతా స్వచ్ఛందంగా బంద్ పాటించి ఐక్యత చాటాలని కోరారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

బీసీ బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ తెలిపారు. కేటీఆర్, మాజీ మంత్రి సబితా రెడ్డి ఆదేశాలతో చేవెళ్లలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ బంద్‌కు మద్దతుగా ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు.